సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్‌బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్‌ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్‌తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్‌గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్‌ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్‌పేట్	245	,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్‌లైన్స్‌పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్నవారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ధ్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వ డం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభు త్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూ మ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్‌కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేత కానీలను మాలలున్న సీ గ్రూప్‌లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్‌లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్‌శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్సీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్‌లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం

ఎస్సార్ విజయకేతనం..

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్ధార్థ(ఫిజిక్స్‌లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపర్తి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్‌రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్‌కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్విక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

మాగనూరు, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం 53 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐ శ్రీశైలం, ఎంపీడీవో రహ్మతుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్దలో..

దామరగిద్ద, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి 136మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీవో సాయిలక్ష్మి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప, నాయకులు బాల్‌రెడ్డి, పుప్పాల్‌రెడ్డి, శరణ్యానాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సాయం

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 11 : మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎండీ జాంగీర్‌కు మంగళవారం మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి అర్థిక సాయం అందజేశారు. జాం గీర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతని ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రూ.35వేలు జమ చేశారు. వాటితోపాటు మాజీ జెడ్పీటీసీ రూ.15వేలు కలి పి మొత్తం రూ.50వేలు బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయన్నగౌడ్, రాజు, యాదయ్య, బాలయ్య యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రాము, రాజేందర్ విష్ణువర్ధన్‌గౌడ్ ఉన్నారు.

అర్థిక సాయం అందజేత

జడ్చర్ల(రాజాపూర్), ఫిబ్రవరి 11 : రాజాపూర్ మండలం కుచ్చకల్ గ్రామానికి చెందిన ఎర్ర లక్ష్మయ్య(65) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు అభిమాన్యురెడ్డి అంత్యక్రియల ఖర్చులకు రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళవారం అభిమాన్యురెడ్డి యువసేన నాయకులు లక్ష్మయ్య ఇంటికి వెళ్లి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. అర్థిక సాయం అందజేసిన వారిలో నాయకులు వెంకటయ్యగౌడ్, నర్సింహులు, కర్ణాకర్‌గౌడ్, హరి కృష్ణగౌడ్, యాదయ్య ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

దేవరకద్ర, ఫిబ్రవరి 11 : అనుమతులు లేకుండా రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిపర్‌ను పట్టుకున్నట్లు తాసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. వెంకటాయపల్లి గ్రామ సమీపంలోని సోమవారం రాత్రి టిపర్‌లో ఇసుకను తరలిస్తుండగా రాయిచూర్ రహదారిపై స్వాధీనం చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభోత్సవమా..! గృహప్రవేశాలా..!!

- 15 నెలలకు 'డబుల్' ఇండ్లకు మోక్షం
- ఇండ్లకు 2023 అక్టోబర్‌లోనే నాటి మంత్రి హరీశ్‌రావుచే ప్రారంభోత్సవం
- మళ్లా ప్రారంభానికి ఏర్పాట్లు

కల్వకుర్తి మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్‌లో 99లో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన 240 డబుల్ బెడ్రూం ఇండ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. ఈనెల 12న బుధవారం మంత్రి సీతక్క చేతుల మీదుగా డబుల్ ఇండ్లకు ప్రారంభోత్సవం చేయిస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు అయోమయానికి గురిచేస్తున్నాయి. 2023 అక్టోబర్ 1న కేసీఆర్ ప్రభుత్వంలో అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్లకు ప్రారంభోత్సవం చేశారు. ఒకసారి ప్రారంభోత్సవం చేసిన ఇండ్లకు రెండోసారి ప్రారంభోత్సవం చేయడమేమిటని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. విషయమై మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కేసీఆర్ ప్రభుత్వంలో..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి మున్సిపాలిటీలో రూ.12.72 కోట్ల వ్యయంతో 240 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎంపిక చేశారు. లబ్ధిదారులకు ఇండ్లు అప్పగించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డబుల్ ఇండ్లు లబ్ధిదారులకు అప్పగించే



ప్రక్రియ పెండింగ్‌లో పడిపోవడంతో లబ్ధిదారులు రెండు, మూడు పర్యాయాలు ఆందోళనలు చేశారు. 15 నెలల తర్వాత చివరకు డబుల్ ఇండ్లల్లో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేసి గత రెండు రోజుల కిందట కాంగ్రెస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు.

సార్.. తులం బంగారం ఎప్పుడిస్తారు..?

- చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యేను అడిగిన మహిళ

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని అడుగుతున్న మహిళ

అమరచింత, ఫిబ్రవరి 11 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కల్యాణలక్ష్మి పథకంతో కలిపి తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం వనపర్తి జిల్లా అమరచింత తాసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలైన పద్మ కల్యాణలక్ష్మి చెక్కు అందుకున్న అనంతరం సార్.. సీఎం సార్ కల్యాణలక్ష్మి డబ్బులతోపాటు తులం బంగారు ఇస్తామని చెప్పారు కదా.. ఎప్పుడిస్తారు సార్.. అని అడిగింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే ఇస్తాం.. కొంత సమయం పడుతుందని బదులిచ్చారు.

చిన్నారులపై అధికార దర్పం

- ఎండలో నిలబెట్టి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పించుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 : దేశ జాతీయ నాయకుల పుట్టిరోజు సందర్భంగా పాఠశాలల్లో జరిగే ప్రార్థన సమయాల్లో దేశానికి వారు చేసిన త్యాగాలు, వారి జీవితాల నుంచి ఎలా స్ఫూర్తి పొందాలనే విషయాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించడం తెలిసిందే. అయితే నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని మరికల్ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం ముక్కుపచ్చలారని చిన్నారులకు చేతిలో తలా ఓ అరటి పండును పెట్టి రాజకీయ నాయకుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పించుకోవడంతోపాటు నోరు తిరగని చిన్నారులతో మళ్లీమళ్లీ చెప్పించుకొని రాక్షసానందం పొందిన రాజకీయ నాయకుల గురించి ఎంత చెప్పినా తక్కువే. సోమవారం పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. పిల్లలపై అధికార దర్పం ప్రదర్శించి బలవంతంగా వారితో పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అరటి పండ్ల ఆశ చూపి పలకడానికి నోరు తిరగని చిన్నారులతో శుభాకాంక్షలు చెప్పించిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండల ప్రజలు sdరు రాజకీయ నాయకులను అసహ్యించుకున్నారు. పిల్లల హక్కులను కాలరాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చిన్న బ్యానర్ కట్టారని.. తాసీల్దార్‌ను నిలదీసిన కాంగ్రెస్ నేతలు

- పైసలు లేకుంటే తామే పెద్ద బ్యానర్ ఇస్తామన్న పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి
- పనిచేయడం ఇష్టంలేకుంటే మరో చోటుకు వెళ్లాలని తాసీల్దార్‌కు సూచన

మరికల్, ఫిబ్రవరి 11 : నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి బ్యానర్ చిన్నగా ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హాజరవుతున్నా కనీసం రోడ్డుపై సున్నం వేయలేదని తాసీల్దార్‌ను నిలదీశారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష పార్టీలకు ఇచ్చిన మర్యాద అధికార పార్టీ నాయకులకు ఇవ్వడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మా కార్యకర్తలకు అధికారులు గౌరవం ఇవ్వకుంటే బాగోదన్నారు. బ్యానర్ కట్టడంలో ఆర్థిక సమస్య ఉంటే క్యాంప్ కార్యాలయం నుంచి పెద్ద బ్యానర్ ఇప్పిస్తామన్నారు. మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా చూడాలన్నారు. ఇక్కడ విధులు నిర్వహించడం ఇష్టంలేకుంటే మరో చోటుకు బదిలీపై వెళ్లాలని తాసీల్దార్‌కు సూచించారు.

నారాయణపేట జిల్లా మరికల్‌లో బ్యానర్ విషయమై తాసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

సమస్యలను పరిష్కరించాకే ఎన్నికలకు వెళ్లాలి

- మాజీ సర్పంచుల సంఘం నాయకుల డిమాండ్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

జడ్చర్ల, ఫిబ్రవరి 11 : రాష్ట్రంలోని మాజీ సర్పంచుల సమస్యలను పరిష్కరించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను మాజీ సర్పంచులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా రాష్ట్రంలోని గ్రామాల్లో సర్పంచులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా అందుకు సంబంధించిన బిల్లులను